సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

గురువారం । 20 । ఏప్రిల్ । 2023



సమ్మెటివ్‌కు సర్వం సిద్ధం
ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. -8లో..



వైభవం..ధ్వజారోహణం
పుష్పగిరిలోని శ్రీ కామాక్షి వైద్యనాథేశ్వర స్వామి,శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వాముల బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. -8లో..



పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి
పెండింగ్ కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసులకు సూచించారు. -8లో..

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు (సా॥)	సహర్ శుక్ర (ఉ॥)
కడప	6.32	4.43
ప్రొద్దుటూరు	6.31	4.45
పులివెందుల	6.35	4.48

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈనెల 21వ తేదీన తమ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. వినూత్న ఫర్టిలైజర్స్ కంపెనీలో సేల్స్ రెప్రజెంటేటివ్స్‌గా, యంగ్ ఇండియాలో ట్రైనీ మేనేజర్‌గా పనిచేసేందుకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. సేల్స్ రెప్రజెంటేటివ్ ఉద్యోగానికి అభ్యర్థులు 19-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. అలాగే ట్రైనీ మేనేజర్ ఉద్యోగానికి అభ్యర్థుల వయస్సు 28 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఓ బ్లాక్ కార్యాలయానికి విద్యార్హతల ధ్రువపత్రాలు, ఫొటోలు తీసుకు రావాలన్నారు. అలాగే అభ్యర్థులు తమ వివరాలను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎన్‌సీఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

రేపు రాష్ట్ర స్థాయి బండ లాగుడు పోటీలు

కమలాపురం: మండల పరిధిలోని పెద్దచెప్పలిలో వెలసిన శ్రీ ఎల్లమ్మ(హేలాంబ) తిరునాలను పురస్కరించుకొని శుక్రవారం రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిసున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ మాచునూరు ఇంద్రావతమ్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మొదటి బహుమతి రూ.1 లక్ష, ద్వితీయ బహుమతి రూ.80వేలు, తృతీయ బహుమతి రూ. 60వేలు, నాల్గవ బహుమతి రూ.50వేలు, ఐదవ బహుమతి రూ.40వేలు, ఆరవ బహుమతి రూ.30 వేలు, ఏడవ బహుమతి రూ.20వేలు, 8వ బహుమతి రూ.15వేలు, 9వ బహుమతి రూ.10వేలు, పదవ బహుమతి రూ.8వేలు, 11వ బహుమతి రూ.5వేలు నగదు రూపంలో అందజేస్తామని ఆమె తెలిపారు. పోటీలో పాల్గొన దలచిన వారు ఆలయ ప్రాంగణంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

భూములు పరిశీలించిన జేసీ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మాలెపాడు, కలమల్ల గ్రామాలలో జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా భూ రీసర్వేకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. భూ రీసర్వేను కచ్చితంగా చేయాలని అధికారులకు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎ. నాగేశ్వరరావుతో పాటు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ విద్యుత్ ఎస్‌ఈ' కార్యక్రమం

కడప కార్పొరేషన్: విద్యు త్ సమస్యల పరిష్కారానికి ఈనెల 20వ తేది స్థానిక విద్యుత్ భవన్‌లో 'డయల్ యువర్ విద్యుత్ ఎస్‌ఈ' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. మునిశంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. వినియోగదారులు 08562-242457 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు తెలిపి పరిష్కరించుకోవచ్చన్నారు.

ఎన్‌హెచ్ భూ సేకరణ పనులపై దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : జాతీయ రహదారుల భూ సేకరణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. ఈ అంశంపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ భూ సేకరణ పూర్తి చేసి నిధులు విడుదల చేయాలన్నారు. అధికారులు అలసత్వం వహించకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య అర్జీల పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం అనే అంశంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ప్రజల వినతులను సంతృప్తకరస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలను గుర్తించి హెల్త్ న్యూట్రిషన్ సేవలు అందించాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ అధికారులతో ఈ అంశంపై సమీక్షించారు. ఈ కార్యక్రమాల్లో జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

లోకం విడిచి.. శోకం మిగిల్చి

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా కన్నీరు పెట్టుకుంది. బుధవారం వేర్వేరు ప్రాంతాల్లో రైలుకిందపడి ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఓ చోట వేధింపులు.. మనస్తాపం కారణంగా 'నవ' దంపతులు తమ నిండు ప్రాణలు వదలగా.. మరో చోట అప్పులబాధతో మరోవ్యక్తి.. ఇంకోచోట మరో ఇద్దరు ఇతర కారణాలతో బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఈ హృదయ విదారక సంఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు.

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో వేర్వేరు చోట్ల రైలు కింద పడి ఐదుగురి ఆత్మహత్య
- వేధింపులు.. ఆర్థిక సమస్యలే ప్రధాన కారణం
- మృతుల్లో నవ దంపతులు
- శోకసంద్రంలో కుటుంబీకులు



శోకసంద్రంలో మృతుల కుటుంబసభ్యులు, బంధుమిత్రులు (ఇన్‌సెట్) మృతుల కుటుంబీకులను ఓదార్చుతున్న రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ రామనశ్రీలక్ష్మి



సాయికుమార్‌రెడ్డి, హేమమాలిని పెళ్లి ఫొటో (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్/చెన్నూరు: చెన్నూరు మండలం రామనపల్లె గ్రామానికి చెందిన గాజులపల్లె సాయికుమార్‌రెడ్డి (29), డి.హేమమాలిని (27) దంపతులు మంగళవారం రాత్రి కడప నగర శివార్లలోని కనుమలోపల్లె సమీపంలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ కింద పడి ప్రాణాలు తీసుకున్నారు. రైల్వే ఎస్‌ఐ రారాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చెన్నూరు మండలానికి చెందిన సాయికుమార్‌రెడ్డి కడపకు చెందిన హేమమాలినిని తొమ్మిది నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం హేమమాలిని ఏడు నెలల గర్భిణిగా ఉన్నారు. వివాహమైనప్పటి నుంచి వీరిరువురు కడప నగరంలోని విజయదుర్గ కాలనీలో నివాసమంటున్నారు. సాయికుమార్‌రెడ్డి వాటర్ బాటిల్ సరఫరా చేసే ఓ కంపెనీ తరుపున కమీషన్ ఏజెంటుగా పనిచేస్తుండగా, ఆయన సతీమణి హేమమాలిని మరియాపురంలోని రియల్ ఎస్టేట్ కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తూ జీవనం సాగించేవారు. దంపతుల ఆత్మహత్య సంఘటనపై కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్‌ఐ రారాజు తెలిపారు.

వేధింపులే కారణం..

తన కుమారుడు, కోడలి ఆత్మహత్యకు పాలెంపల్లెకు చెందిన నారాయణస్వామి అనే వ్యక్తి వేధింపులే కారణమని మృతుడు సాయికుమార్‌రెడ్డి తల్లి వరలక్ష్మి ఆరోపించారు. ఆమె కథనం మేరకు.. చెన్నూరుకు చెందిన వరలక్ష్మి, రమణారెడ్డి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. తన భర్త రమణారెడ్డి మరణంతో ఆమె పుట్టినిల్లయిన రామనపల్లెకు వెళ్లి అక్కడే ఉంటోంది. తన తల్లిదండ్రుల ద్వారా వచ్చిన భూమిని సాయికుమార్‌రెడ్డి కడప నగరం పాలెంపల్లెకు చెందిన నారాయణస్వామి అనే వ్యక్తికి రూ. 3 లక్షలకు తాకట్టు పెట్టాడు. తాకట్టు పెట్టేముందు తన డబ్బు వడ్డీతో సహా ఎప్పుడైనా చెల్లించాలని, మీ భూమిని మీకు తిరిగి ఇస్తానని అతను చెప్పాడు. ఇటీవల డబ్బు తీసుకుని వెళ్లి తన భూమి తనకు ఇవ్వాలని సాయికుమార్‌రెడ్డి నారాయణస్వామిని అడుగగా అతను ఇవ్వకపోగా అనేక విధాలుగా ఇబ్బంది పెట్టాడు. ఇందుకు సంబంధించి పంచాయతీలు కూడా జరిగాయి. అయినా ఫలితం లేదు. దీనికితోడు నారాయణస్వామి తన అనుచరుల చేత అనేకమార్లు బెదిరించి దుర్భాషలాడాడు. తన భూమిని అక్రమంగా తీసుకోవడమే కాకుండా తనను మానసికంగా వేధించడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఇక తనకు న్యాయం జరగదని తెలిసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంతో అన్యోన్యంగా జీవిస్తున్న తమ కుటుంబం నారాయణస్వామి వేధింపులతో చిన్నాభిన్నమైందని వరలక్ష్మి కన్నీరు మున్నీరైంది.

గ్రామంలో విషాద ఛాయలు

ముక్కుపచ్చలారని యువ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారన్న వార్త మండల వ్యాప్తంగా వ్యాపించడంతో అటు రామనపల్లె, ఇటు చెన్నూరు భవానీనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను కడసారిగా చూసేందుకు గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. బంధువులు, స్నేహితులు గ్రామస్తులు బోరున విలపించారు. నిండు గర్భిణి అయిన హేమమాలినిని చూసి గ్రామస్తులు చలించిపోయారు. సాయంత్రం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు, ఆత్మీయుల మధ్య దంపతుల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. కాగా రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మి యువ దంపతుల మృతదేహాలను చెన్నూరుకు గతీసుకొచ్చి అంత్యక్రియలు ముగిసేవరకు దగ్గరుండి మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అప్పుల వారి ఒత్తిడి అధికమై..



రైలు కిందపడి మృతి చెందిన మోహన్‌రాజు

కడప కోటిరెడ్డిసర్కిల్ : లక్కిరెడ్డిపల్లె మండలం రాచపల్లె గ్రామానికి చెందిన ముద్దలూరు మోహన్‌రాజు గతంలో జీవనోపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లాడు. ఇటీవల స్వదేశానికి చేరుకున్న రాజు రాయచోటిలో ఓ హోటల్ నిర్వహిస్తుండేవాడు. ఈ క్రమంలో పలువురి వద్ద అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి అధికం కావడంతో దిక్కుతోచని స్థితిలో కడప-కృష్ణాపురం మార్గమధ్యంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

గుర్తుతెలియని దివ్యాంగుడు..



రైలు కిందపడి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

కడప-భాకరాపేట రైల్వేస్టేషన్ మధ్య సుమారు 45 సంవత్సరాల వయస్సుగల దివ్యాంగుడు కదులుతున్న రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడు జైపూర్ ప్లాస్టిక్ కాలు కలిగి ఉన్నాడు. మృతదేహాన్ని గుర్తించిన వారు కడప రైల్వే పోలీసులకు (సెల్ నంబరు 94406 46974 లేదా స్టేషన్ రైటర్ 9502051021) సమాచారం అందించాలని ఎస్‌ఐ రారాజు కోరారు.

రాజంపేటలో ఎల్‌ఐసీ ఏజెంట్..

రాజంపేట:రాజంపేట రైల్వేస్టేషన్‌లో ఎల్‌ఐసీ ఏజెంట్ కేవీ రమణయ్య(58) బుధవారం రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తల, మొండెం వేరయ్యాయి. సమాచారం అందుకున్న రేణిగుంట రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసినట్లు రేణిగుంట జీఆర్పీ ఎస్‌ఐ అనిల్ తెలిపారు. మృతికి గల కారణాలు దర్యాప్తులో వెలుగు చూస్తాయని వెల్లడించారు. మృతుని స్వగ్రామం రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలం వత్తలూరుగా గుర్తించారు. ప్రస్తుతం రాజంపేట పట్టణంలో నివాసం ఉంటున్నాడు. మృతునికి భార్య సుబ్బమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు.



రైలుకిందపడి మృతిచెందిన రమణయ్య

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా శ్రీనివాస్ ఆంజనేయమూర్తి

కడప అర్బన్ : వైఎస్సార్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా కృష్ణా జిల్లా విజయవాడ రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా పనిచేస్తున్న వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు హైకోర్టు నుంచి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైఎస్సార్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన సోల్మన్‌రాజు గతేడాదిలో ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తిగా సీఎస్ మూర్తి పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి నుంచి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పోస్టు ఖాళీగా ఉండడంతో తాజాగా వెలువడిన న్యాయమూర్తుల బదిలీల ఉత్తర్వుల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి నియమితులయ్యారు. ఈయన 1995లో న్యాయశాఖలో తొలిసారిగా జడ్జిగా నియమితులయ్యారు. విజయవాడ కోర్టు 8వ అదనపు జిల్లా జడ్జిగా, మూడవ అదనపు జిల్లా జడ్జిగా, రెండవ అదనపు జిల్లా జడ్జిగా పనిచేశారు. అక్కడి నుంచి వైఎస్సార్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీపై రానున్నారు.

సీనియర్ సివిల్ జడ్జిల బదిలీలు

వైఎస్సార్ జిల్లాలో పలువురు జడ్జిల బదిలీలు జరిగాయి. కడపలోని ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్.హేమలతను ప్రకాశం జిల్లా ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. వైఎస్సార్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జిగా పనిచేస్తున్న కవితను కడపలోని ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. రాజంపేట సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్.సరస్వతిని తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం జడ్జిగా బదిలీ చేశారు. కర్నూలు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న టి.కేశవను రాజంపేట కోర్టుకు బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బాబు నోట.. పాత పాట

- బోరు కొట్టించిన చంద్రబాబు ప్రసంగం
- ఆద్యంతం ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి జగన్‌పై విమర్శలు
- దిశానిర్దేశం అంటూ సొంత డబ్బా
- నిరుత్సాహంగా కార్యకర్తలు

బద్వేలు అర్బన్/అట్లూరు : నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో భాగంగా బుధవారం బద్వేలుకు వచ్చిన చంద్రబాబు పాత పాటే అందుకున్నారు. హైదరాబాద్‌ను తానే అభివృద్ధి చేశానని, రాష్ట్రంలో సైకో పాలన నడుస్తోందని ఆద్యంతం తన సొంత డబ్బా వాయించుకుంటూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రోజూ టీవీల్లో, సోషల్ మీడియాలో చేస్తున్న ప్రసంగాలే తిరిగి చంద్రబాబు చేయడంతో కార్యకర్తలు నిరుత్సాహానికి గురయ్యారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం సమావేశం ఉదయం 10 గంటలకు జరగాల్సి ఉండగా 11-30 గంటలకు ప్రారంభమైంది. తొలుత విజయమ్మ నివాసంలో బద్వేలు నియోజకవర్గ ముఖ్య నాయకులతో చంద్రబాబు సమావేశమయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు

ఈ సమయంలో ముఖ్య నాయకులు అందరి అభీష్టం మేరకే అభ్యర్థి ఎంపిక జరగాలని, అది కూడా త్వరితగతిన అభ్యర్థిని ప్రకటించాలని చంద్రబాబు దృష్టికి తీసుకురాగా దీనిపై ఆయన నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. అనంతరం విజయమ్మ నివాసం నుంచి చెన్నంపల్లె సమీపంలో గల సభా వేదికకు చేరుకున్నారు.

పాత పాటే అందుకున్న బాబు

2019 ఎన్నికల ప్రచారం తర్వాత నాలుగేళ్ళ సుదీర్ఘ విరామం అనంతరం బద్వేలులో జరిగే కార్యకర్తల సమావేశానికి వచ్చిన చంద్రబాబు నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాల్సిందిపోయి హైదరాబాద్‌లో హైటెక్‌సిటీ, ఔటర్ రింగ్‌రోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్టు, మెట్రో రైలు, బయోటెక్నాలజీజినాంవ్యాలీ, ఐటీ సంస్థలను ఏర్పాటు చేశానని, సెల్‌ఫోన్ల తయారీ టీడీపీ ఇచ్చిన పాలసీతోనే సాధ్యమైందని చెప్పుకొచ్చారు. కరోనా వ్యాక్సిన్ తయారీలో కూడా మన పాత్ర ఉందని చెప్పారు. ఆ తర్వాత రాష్ట్రంలో సైకోపాలన నడుస్తోందని, జగన్ ఓ అసమర్థుడని, బాబాయ్ హత్యకేసు అంటూ తన ప్రసంగంలో ఆద్యంతం ప్రభుత్వంపైన, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైన విమర్శలు చేశారు. చాలా ఏళ్ల తర్వాత బద్వేలులో సమావేశానికి వచ్చిన అధినేత కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతాడు అనుకుంటే పాత పద్ధతిలోనే తన ప్రసంగంతో కార్యకర్తల్లో నిరుత్సాహం నింపారని అక్కడికి వచ్చిన ద్వితీయశ్రేణి నాయకులు చర్చించుకోవడం కనిపించింది. ఇదే సమయంలో కార్యకర్తలు సైతం చంద్రబాబు ప్రసంగం జరుగుతున్న సమయంలోనే బయటకు వచ్చేశారు.

సమావేశానికి హాజరు కాని కీలక నేతలు

చంద్రబాబు సమక్షంలో బద్వేలులో జరిగిన టీడీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆ పార్టీలోని విభేదాలు బట్టబయలయ్యాయి. సమావేశానికి నియోజకవర్గంలోని పలువురు ముఖ్య నేతలు గైర్హాజరయ్యారు. ఇందుకు ప్రధాన కారణం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిపై ఉన్న అసమ్మతేనని తెలుస్తోంది. బద్వేలు మాజీ జెడ్పీటీసీ శిరీష, ఆమె తండ్రి, పార్టీ బద్వేలు మాజీ మండల అధ్యక్షుడు జయరామిరెడ్డి, కలసపాడు పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బాలిరెడ్డి, అట్లూరు మండలానికి చెందిన ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ పార్టీ ఉపాధ్యక్షుడు కె.చిన్నమునిరెడ్డిలు సమావేశానికి హాజరు కాలేదు. కాశినాయన మండలానికి చెందిన టీడీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కర్నాటి శ్వేతారెడ్డి, ఆమె భర్త కాశినాయన మండల టీడీపీ నాయకుడు కర్నాటివెంకటరెడ్డి కూడా సమావేశానికి హాజరు కాకుండా నరసాపురం సమీపంలో చంద్రబాబును కలిశారు. గైర్హాజరు సాక్షిగా టీడీపీలో అసమ్మతి బట్టబయలైంది.

చంద్రబాబుకు నిరసన సెగ

బద్వేలు అర్బన్ : బద్వేలు పర్యటనకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబుకు నిరసన సెగ తగిలింది. దళితుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన నారాలోకేష్‌తో క్షమాపణలు చెప్పించాకే బద్వేలు లాంటి దళిత అసెంబ్లీ నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటించాలని కోరుతూ బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఆధ్వర్యంలో దళిత నేతలు ఆందోళన చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో సుమారు రెండు గంటల పాటు సాగిన ఈ నిరసనలో ఎమ్మెల్యేతో పాటు దళిత నేతలు నల్లరిబ్బన్లు, నల్ల జెండాలు, నల్లబెలూన్లు చేతపట్టుకుని దళిత ద్రోహి చంద్రబాబు, లోకేష్ ... చంద్రబాబు గోబ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 12-30 గంటలకు ప్రారంభమైన ఈ నిరసనలో మండుటెండను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే, దళిత నేతలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధ మాట్లాడుతూ విదేశీ విద్య వలన దళితులు పీకిందేమీ లేదని లోకేష్ వ్యాఖ్యానించడం దళితులను అవమానించడమే అన్నారు. దళితుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన నారాలోకేష్‌తో దళితులకు క్షమాపణ చెప్పించాలని, లేనిపక్షంలో రాబోవు రోజుల్లో చంద్రబాబును, లోకేష్‌ను నియోజకవర్గంలో అడుగు పెట్టనివ్వబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల, బి.కోడూరు జెడ్పీటీసీలు ముత్యాలప్రసాద్, దావీదు, కలసపాడు మాజీ జెడ్పీటీసీ సగిలిసుదర్శన్, కౌన్సిలర్లు చెన్నయ్య, వరలక్ష్మి, రామ్మోహన్, శ్రీదేవి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ నారాయణ, వైఎస్సార్‌సీపీ గోపవరం మండల సచివాలయ కన్వీనర్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు గోబ్యాక్ అంటూ నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ, దళిత సంఘాలు

టీడీపీ హయాంలో ముస్లింలకు జరిగిన మేలేమిటి?



ఇఫ్తార్ ప్రార్థనలు నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి, కలెక్టర్, నగర మేయర్ తదితరులు

- చంద్రబాబుపై డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఫైర్
- ముస్లింలకు ప్రభుత్వం ఇఫ్తార్ విందు

కడప కల్చరల్: టీడీపీ హయాంలో ముస్లిం మైనార్టీలకు మీరు చేసిన మేలు ఏమిటో చెప్పాలని, వారి సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని, పైగా తప్పుడు కేసులు పెట్టి వారిని నానా తిప్పలు పెట్టారని, అలాంటి నీకు ముస్లిం మైనార్టీల సంక్షేమం గురించి మాట్లాడే హక్కు లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా టీడీపీ అధినేత చంద్రబాబుపై మండిపడ్డారు. బుధవారం వైఎస్సార్ జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ విజయరామరాజు ముస్లిం మైనార్టీలకు స్థానిక నూర్జహాన్ ఫంక్షన్ హాలులో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ టీడీపీ హయాంలో ముస్లిం మైనార్టీలకు జరిగిన మేలు శూన్యమేనని, అలాంటి చంద్రబాబు మైనార్టీల సంక్షేమం గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఆయన పాలనలో ముస్లిం మైనార్టీల్లో ఒక్కరికి కూడా మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. ఇప్పుడు కేవలం ఎన్నికల కోసం కల్లబొల్లి మాటలు మాట్లాడుతూ ఓట్ల రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. పవిత్రమైన దర్గాలో ఆయన రాజకీయాల గురించి మాట్లాడటం దారుణమన్నారు. ఆయనకు రాజకీయ సమాధి కట్టేందుకు ముస్లిం మైనార్టీలు సిద్ధంగా ఉన్నారన్నారు. ముస్లిం మైనార్టీల కోసం ప్రత్యేకంగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన దివంగత వైఎస్సార్‌తోపాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముస్లింలు గుండెల్లో పెట్టుకుంటారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఇఫ్తార్

కలెక్టర్ విజయరామరాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ యంత్రాంగం ఇచ్చిన ఇఫ్తార్ విందులో నగర మేయర్ సురేష్ బాబు, అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్, మత గురువు హజరత్ వలీవుల్లా హుసేనీ సాహెబ్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసులాజం, వైఎస్సార్ సీపీ మైనార్టీ నేతలు అఫ్జల్‌ఖాన్, డాక్టర్ సొహైల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. ధ్వజారోహణం

ప్రారంభమైన పుష్పగిరి బ్రహ్మోత్సవాలు

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి,శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వాముల బ్రహ్మోత్సవాలు బుధవారం రెండు ఆలయాల్లో నిర్వహించిన ధ్వజారోహణం కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. వేద పండితుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో పూజారి శ్రీనివాస మూర్తి ఉదయం గణపతి పూజ నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, శ్రీ చక్ర సహిత కామాక్షీ దేవికి కుంకుమార్చన చేశారు. నందీశ్వరుని చిత్ర పటాన్ని ధ్వజ స్థంభంపై అధిష్ఠింప చేశారు. అగ్ని ప్రతిష్ఠాపన చేసి హోమాలను ప్రారంభించారు. అనంతరం నవకళశ స్థాపన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. రాత్రి హంస వాహనంపై శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఆలయంలో తెల్లవారు జామున సుప్రభాత సేవ జరిగింది. అనంతరం ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ నిర్వహించారు. రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గరుడుని చిత్ర పటాన్ని ధ్వజ స్థంభంపై అధిష్ఠింప చేశారు. కార్యక్రమంలో అర్చకులు సుమంత్ దీక్షితులు, రాజేష్ పాల్గొన్నారు.



శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి, వైద్యనాథేశ్వర స్వామి ఆలయాల్లో ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

పుష్పగిరిలో నేడు

బ్రహ్మోత్సవాల్లో గురువారం శ్రీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం, కుంకుమార్చన జరుగుతాయి. రాత్రి స్వామి వారికి సింహవాహన సేవ జరుగుతుంది. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం, తోమాల సేవ ఉంటుంది. రాత్రి స్వామివారికి గజవాహన సేవ జరుగుతుంది.

'బ్రౌన్'లో పుస్తక విక్రయ కేంద్రం

కడప కల్చరల్: యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో పుస్తక విక్రయ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. బ్రౌన్ సంస్థ ద్వారా ఇటీవల ప్రచురించిన పుస్తకాలన్నింటినీ ఈ కేంద్రంలో అందుబాటులో ఉంచారు. ఇటీవలే ప్రారంభించిన ఈ కేంద్రంలో కొద్ది కాలంగా బ్రౌన్ కేంద్రం ప్రచురించిన మొత్తం 30 రకాల పుస్తకాలను విక్రయానికి ఉంచారు. ప్రస్తుతం ఈ పుస్తకాల కొనుగోలుపై 20 శాతం తగ్గింపు అవకాశం కల్పించారు. ఆసక్తిగల పాఠకులు నేరుగా బ్రౌన్ కేంద్రాన్నిగానీ లేదా 93906 56488 నంబరులో సంప్రదించాలని కోరారు.

వేధింపులపై కేసు నమోదు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో నివాసం ఉండే లక్ష్మీదేవి తన భార్త కోట నాగరాజు అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎర్రగుంట్ల పోలీసులు తెలిపారు. రాజంపేట మండలం వెంకటరాజంపేట గ్రామానికి చెందిన కోట నాగరాజుకు ఎర్రగుంట్ల శాంతినగర్ కాలనీకి చెందిన వెంకటమ్మ, రామసుబ్బయ్య దంపతుల కుమార్తె లక్ష్మీదేవితో 30 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి సంతానం లేరు. ఈ నేపథ్యంలో అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని లక్ష్మీదేవి ఫిర్యాదులో పేర్కొందని సీఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

సమ్మేటివ్‌కు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఎఫ్‌ఏ-2 పరీక్షలు ప్రారంభం
- పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- 1 నుంచి 8 వరకు సీబీఏ విధానంలో పరీక్ష నిర్వహణ
- 9వ తరగతికి పాత పద్ధతిలోనే పరీక్ష



కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఇందులో 1 నుంచి 5వ తరగతి వరకు ఈనెల 20 నుంచి 26 వరకు, 6 నుంచి 9 తరగతులకు 20 నుంచి 29 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో విద్యార్థుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పరీక్షల వేళల్లో స్వల్ప మార్పులు చేశారు. ఇందులో 1 నుంచి 8వ తరగతుల విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగాల్సిన పరీక్షలను ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నారు. అలాగే 9వ తరగతికి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్ష నిర్వహించనుండగా ఉదయం 8 గంటల నుంచి 11.15 గంటల వరకు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు సంబంధించిన పశ్నాపత్రాలను కడప డీసీఈబీ నుంచి మండల కేంద్రాలకు తరలించి ట్రంకు పెట్టెలో భద్రపరిచారు. నేటి నుంచి ప్రారంభం కానున్న వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. ఈ పరీక్షలను ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా 3,22,948 మంది విద్యార్థులు రాయనున్నారు.

సీబీఏ విధానంలో...

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన లోపాలను గుర్తించడంతోపాటు వారి సామర్థ్యాలను వెలికి తీయడం సీబీఏ పరీక్షల ప్రధాన ఉద్దేశం. గుణాత్మక విద్యను అందించడంతోపాటు ఉత్తమ విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎస్‌సీఈఆర్టీ సీబీఏ విధానాన్ని కొన్ని పరీక్షలకు అమలు చేస్తున్నారు. ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-3 పరీక్షలను ఇప్పటికే సీబీఏ విధానంలో అమలు చేశారు. ఎఫ్ఏ-4 సమ్మేటివ్-1 పరీక్షలను పాత విధానంలో నిర్వహించారు. ప్రస్తుతం నిర్వహించనున్న సమ్మేటివ్ -2 పరీక్షలను ఓఎంఆర్ విధానంలో విద్యార్థులు రాయాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఓఎంఆర్ షీట్లను కడప డీసీఈబీ నుంచి మండల కేంద్రాలకు తరలించారు.

టైం టేబుల్ విడుదల

సమ్మేటివ్-2 పరీక్షలకు సంబంధించిన టైమ్ టేబుల్‌ను ఎస్‌సీఈఆర్టీ విడుదల చేసింది. పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి ఫలితాలను ఆన్‌లైన్‌లో పొందు పరచాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది. 1,2 తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లిష్, 25న గణితం, 3,5 తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లిష్, 25న గణితం, 26న పరిసరాల విజ్ఞానం, 6, 9 తరగతులకు 20న తెలుగు, 24న హిందీ, 25న ఇంగ్లిష్, 26న గణితం, 27న జనరల్ సైన్సు, 28న సోషియల్ , 29న కాంపోజిట్ కోర్సులు పేపర్-1, మే 4న కాంపోజిట్ కోర్సులు పేపర్-2 పరీక్షలను నిర్వహించనున్నారు.

బైలింగ్విష్ విధానంలో ప్రశ్నపత్రం..

సీబీఏ విధానంలో విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రం బైలింగ్విష్(ద్విభాష) విధానంలో ఉంటుంది. ఇప్పటి వరకు ఇంగ్లిష్ మీడియం వారికి ఆంగ్లంలో, తెలుగు మీడియం వారికి తెలుగులో ప్రశ్నపత్రం ఇస్తున్నారు. ఇప్పటికే పాఠ్యపుస్తకాలను బైలింగ్విష్ పద్ధతిలో ముద్రించిన విద్యాశాఖ తాజాగా నూతన విధానంలో బైలింగ్విష్‌లో ప్రశ్నపత్రం రూపొందించారు. దీని వలన విద్యార్థికి ఇంగ్లిష్‌లో ప్రశ్న అర్థం కాకపోతే తెలుగులో చదివి అర్థం చేసుకుంటాడు. ప్రశ్నలను ఆబ్జెక్టివ్ విధానంలో ఇస్తారు. 1 నుంచి 5వ తరగతులకు ఒక్క ఓఎంఆర్, 6 నుంచి 8 తరగతులకు రెండు ఓఎంఆర్‌లు ఇవ్వనున్నారు. లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ పరీక్షలకు వేర్వేరు ఓఎంఆర్‌లను వినియోగిస్తారు.

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలలు, విద్యార్థుల వివరాలు ఇలా...

యాజమాన్యం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రభుత్వ ప్రైమరీ స్కూల్స్	2174	1,33,788
ప్రభుత్వ హైస్కూల్స్	458	1,00,724
ప్రైవేటు ప్రైమరీ స్కూల్స్	235	4376
ప్రైవేటు హైస్కూల్స్	424	84060
మొత్తం	3271	3,22,948

కమిషనర్ ఆదేశాల మేరకు..



కమిషనర్ ఆదేశాలకు పైలెట్ స్టడీ కింద జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో కలిసి 1000 మంది విద్యార్థులను ఎంపిక చేశాము. వీరందరికి క్లాస్ రూమ్ బేస్డ్ అసిస్మెంట్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నాము. ఇందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశాము. ఇందుకోసం ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 178 పాఠశాలలను ఎంపిక చేశాము. ఈ పరీక్ష మండల విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో సీఆర్‌పీలు మానిటరింగ్ చేస్తారు.

– శోభారాణి, డీసీఈబీ సెక్రటరీ. కడప.

కట్టుదిట్టంగా పరీక్షల నిర్వహణ



సమ్మేటివ్-2 పరీక్షల నిర్వహణను చాలా కట్టుదిట్టంగా నిర్వహించేలా అన్ని సూచనలు, సలహాలను ఇచ్చాము. ఎక్కడేకానీ ప్రశ్నాపత్రం లీకేజీ కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఎంఈఓలకు, హెచ్‌ఎంలకు ఆదేశాలను జారీ చేశాము. పరీక్ష పూర్తి అయిన వెంటనే ఉపాధ్యాయులు పేపర్ మూల్యాంకనం చేసి విద్యార్థులకు సమాధాన పత్రాలను ఇచ్చి మార్కులను సెంట్రల్ మార్కుల రిజిస్టర్‌లలో, ప్రోగ్రెస్ కార్డులలో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– ఎద్దుల రాఘవరెడ్డి, డీఈఓ, వైఎస్సార్ జిల్లా

బి.మఠం మండలంలో రెవెన్యూ వ్యవస్థ సరిగాలేదు

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : గత రెవెన్యూ అధికారుల చేతి వాటం భూమిలేని నిరుపేదలకు ఇప్పుడు శాపంగా మారిందని మైదుకూరు శాసనసభ్యుడు శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దిరసవంచలో విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ మండలంలో లేని రెవెన్యూ సమస్యలు బి.మఠం మండలంలో ఉన్నాయన్నారు. ఇక్కడ రెవెన్యూ వ్యవస్థ సరిగా లేదన్నారు. 13 ఏళ్లుగా అసైన్మెంట్ కమిటీ జరగకపోయినా, గతంలో ఉన్న తహసీల్దార్లకు భూ పంపిణీ చేసే అధికారం లేకపోయినా వందల ఎకరాలు మండల వాసులకే కాకుండా ఇతర మండలాల వారికి సైతం ఆన్‌లైన్ చేసినట్లు కన్పిస్తోందన్నారు. ఈ విధానం వల్ల అనుభవంలో ఒకరు ఉంటే , ఆన్‌లైన్ మరొకరి పేరు ఉంటుందన్నారు. అలాంటప్పుడు గ్రామాల్లో సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ఇప్పుడు నిరుపేదలకు భూములు ఇవ్వాలంటే రెవెన్యూ అధికారులు సహకరించడంలేదు. వీళ్ల ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాల్లో తిరుగుతుంటే బి.మఠం మండలంలో ప్రతి ఇంటికి అన్ని సంక్షేమ పథకాలు వర్తించాయని, అధికారులు సహకరిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. కానీ ఇక్కడి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో సమస్యలు తీర్చిలేకపోతున్నాం. నిరుపేదరైతుకు భూ పంపిణీ చేయాలని చూస్తున్నామని, ఇందుకు అధికారులు సహకరించాలన్నారు. బ్రహ్మంగారిమఠం మండలంలో ఉన్న రెవెన్యూ అధికారులపై జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు.ప్రజలను పీడించే అధికారులను తప్పించాలన్నారు. ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. కానీ రెవెన్యూఅధికారుల తప్పిదాలతో ఇక్కడ సమస్యలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం రామగోవిందరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, గ్రామ సచివాలయాల కన్వీనర్ కూనపులి రాజానాయుడు, స్థానిక సర్పంచ్ అమీర్‌బాషా, నాగిశెట్టిపల్లె సర్పంచ్ అనంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బిజివేముల మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపిటీసీ సుబ్బారెడ్డి, బిజివేముల సుబ్బారెడ్డి, సిద్ధారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

చెన్నూరు : పెండింగ్ కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని, నాటుసారా, అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణా నిషేధించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఎస్ఐ శ్రీనివాసులురెడ్డికి సూచించారు. చెన్నూరు పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు.పోలీసు స్టేషన్ ఆవరణాన్ని పరిశీలించారు. పచ్చదనం పెంపొందించాలని, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఎస్ఐని ఆదేశించారు. అనంతరం పోలీసుస్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఉమెన్ హెల్ప్ డెస్క్ రిసెప్షన్‌ను పరిశీలించి మహిళా పోలీసు సిబ్బందితో మాట్లాడారు. మహిళల భద్రతకు పోలీసుశాఖ ప్రత్యేకంగా రూపొందించిన దిశ యాప్‌పై అవగాహన కల్పించి డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు రిజిస్టర్ యూజర్‌గా నమోదు చేసుకునేలా వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

ప్రారంభమైన పది మూల్యాంకనం



మూల్యాంకన విధుల్లో ఉన్న సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: పది పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకనం బుధవారం కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ప్రశాంతంగా ప్రారంభమైంది. ఈ మూల్యాంకనానికి రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి అన్ని సబ్జెక్టులకు సంబంధించి 1, 98,170 పేపర్లు వచ్చాయి. మూల్యాంకన కేంద్రాన్ని డీఈఓ రాఘవరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రక్రియ ఈ నెల 26వ తేదీ వరకు జరుగుతుందన్నారు. మూల్యాంకన కేంద్రంలో పేపర్లు దిద్దే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలను కల్పించామన్నారు. మొదటి రోజు 1,98, 170 పేపర్లకుగాను 12,953 పేపర్లను మూల్యాంకనం చేశారన్నారు. ఇంకా 1,85,217 పేపర్లు మూల్యాంకనం చేయాల్సి ఉందన్నారు. ఈయన వెంటన ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశు, క్లర్కు కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురిపై గంజాయి ముఠా దాడి



గాయపడిన ఖాదర్‌వలీ

కడప అర్బన్ : గంజాయి ముఠా సభ్యులు పేట్రేగిపోయి ప్రజలపై దాడులు నిర్వహిస్తున్నారు. కడప నగరంలోని రవీంద్రనగర్‌లో బుధవారం మందుల దుకాణం వద్ద కూర్చున్న ఖాదర్‌వల్లీ (70) అనే వృద్ధుడిపై గంజాయి మత్తులో కొందరు వచ్చి తమ దగ్గరున్న ఇనుపచువ్వతో దాడి చేశారు. అతనికి కుడి కంటిమీద గాయమైంది. అలాగే మరో ముగ్గురిపై కూడా దాడి చేశారు. రవీంద్రనగర్‌లో మధ్యాహ్నం , సాయంత్రం వేళల్లో పోలీసుల గస్తీ పెంచాలనీ స్థానికులు కోరుతున్నారు. ఈ సంఘటనపై కడప తాలూకా సీఐ ఉలసయ్య ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.

టిక్కెట్ లేని ప్రయాణికులకు జరిమానా

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైలులో టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిపై రైల్వే అధికారులు కొరఢా ఝళిపించారు. బుధవారం గుంతకల్లు డివిజన్ కమర్షియల్ మేనేజర్ సోమశేఖర్ నాయుడు, జనరల్ చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషా ఆధ్వర్యంలో కడప నుంచి ఎర్రగుంట్లవైపు, కడప నుంచి రేణిగుంట వైపు వెళ్లే 11 రైళ్లలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. రైల్వే టిక్కెట్ చెకింగ్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారితోపాటు లైసెన్సులు లేని హాకర్స్‌ల నుంచి రూ. 1.70 లక్షలు అపరాధ రుసుమును వసూలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాకర్స్ కూడా తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. దాడుల్లో గుంతకల్లు, రేణిగుంట, కడప టిక్కెట్ తనిఖీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సాయిగ్రేస్

కడప స్పోర్ట్స్ : ప్రస్తుత సాంకేతిక యుగంలో సైబర్ నేరాల పట్ల అవగాహన, అప్రమత్తత ఎంతో అవసరమని సెట్ప్ సీఈఓ సి. సాయిగ్రేస్ పేర్కొన్నారు. బుధవారం కడపలోని ప్రభుత్వ ఐటీఐలో ఏపీ యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో 'సైబర్ క్రైమ్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్ప్ సీఈఓ మాట్లాడుతూ సైబర్ దాడుల నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ మౌలిక సదుపాయాలను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన విధానం తీసుకొచ్చిందన్నారు. జాతీయ ఇంటర్నెట్ భద్రత విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. తద్వారా సైబర్ భద్రత విధానం కలిగిన కొద్దిదేశాల్లో ఒకటిగా భారత్ నిలిచిందన్నారు. సైబర్ క్రైమ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీధర్‌నాయుడు మాట్లాడుతూ ఇంటర్నెట్ ఆధారంగా జరిపే వ్యక్తిగత, ఆర్థిక, భద్రతాపరమైన నేరాలను సైబర్ నేరాలంటారని వివరించారు. ఇంటర్నెట్ ద్వారా ప్రైవసీని భగ్నం చేడయం, బ్యాంకు ఖాతాలను ఖాళీచేయడం, భద్రతకు ముప్పు కలిగించడం చేస్తున్నారన్నారు. ఇవన్నీ ప్రత్యక్షంగా కాకుండా ఆన్‌లైన్ ద్వారా సైబర్ క్షేత్రంలో జరుగుతున్నాయన్నారు. ఈ నేరాలకు పాల్పడేవారు ఎవరో గుర్తించడం కష్టమన్నారు. వీటి తీవ్రతకు ప్రపంచదేశాలు సైతం వణికిపోతున్నాయని వివరించారు. కావున యువత సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచితులకు ఓటీపీలు చెప్పడం, అన్‌నోన్ ఫేక్ నెంబర్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ కె. రత్నరాజు, సెట్ప్ మేనేజర్ వి.వి.సుబ్బారాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.